క్లుప్తంగా

సాగులో ఆధునిక పద్ధతులు



గిడుతూరులో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

మాకవరపాలెం: పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించాలని పాయకరావుపేట డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ ఉమాప్రసాద్ రైతులకు సూచించారు. గురువారం గిడుతూరులో వరి పొలాల్లో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్లు వేసే విధానం, యాజమాన్య పద్ధతులు, పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచుకునే విధానాలపై అవగాహన కల్పించారు. అర్హులైన రైతులు వీఆర్వోల ద్వారా కౌలు గుర్తింపు కార్డులను పొందాలన్నారు. రైతులు తమ పంటల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో చిరంజీవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

నర్సీపట్నం: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షురాలు గజ్జలమ్మ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డి.డి.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, చైర్మన్ డాక్టరు ఎం.అప్పలనాయుడు, అనకాపల్లి ప్రెసిడెంట్ వి.జగన్నాథరావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్. సోమేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బి.ఎల్.ఎన్.శర్మ, ఏటీవో బి.వి. నాగేశ్వరరావు, ఎస్టీవో సిహెచ్.ఎస్.ఇ. గణేష్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జె.వి. రాఘవరావు హాజరవుతున్నట్లు తెలిపారు.

12న వ్యాసరచన పోటీలు

చోడవరం రూరల్: స్థానిక ప్రేమ సమాజంలో ఈ నెల 12న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సంబంధిత కార్యదర్శి ప్రసాదరాజు గురువారం తెలిపారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు పి.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులు ఆ రోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితంపై వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు.

మార్లగుమ్మి కాలువ పరిశీలన



కాలువ వద్ద పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ: చీడికాడ సమీప దోకల వారి కల్లాల వద్ద మార్లగుమ్మి కాలువకు అడ్డంకి ఉన్న మట్టిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం పరిశీలించారు. ఇక్కడ కల్వర్టు ఏడాదిన్నర క్రితం తుఫాన్ వర్షాలతో కూలిపోయింది. రైతుల అభ్యర్థ మేరకు నాటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మినీ బ్రిడ్జి నిర్మాణానికి రూ.78 లక్షలు మంజూరు చేశారు. దీని నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ మెటీరియల్ తరలించేందుకు మట్టితో గట్టు వేశాడు. ఇటీవల జలాశయం నీరు విడుదల చేయడంతో కాలువలో నీటి ప్రవాహానికి గట్టు అడ్డంకిగా మారింది. 8 గ్రామాలకు సాగు నీరు ప్రవహించలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరిశీలించి 24 గంటల్లో మట్టిని తొలగించి ఆయకట్టుకు నీటిని అందించాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి



ఎంఈవో-1 పడాల్‌దాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

చోడవరం/దేవరాపల్లి: అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. చోడవరం, దేవరాపల్లి ఎంఈవోలు సింహాచలం, బి.పడాల్‌దాస్, వి. ఉషారాణిలకు గురువారం వారు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. విద్యారంగంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. చోడవరం మండల అధ్యక్షుడు బొడ్డపాటి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి నందిగోళ్ల గణేష్, గౌరవాధ్యక్షుడు ఉగ్గిన బాబ్జి, ఉపాధ్యక్షుడు అరిపాక రాజారమేష్, ప్రతినిధి కామరాజు, దేవరాపల్లి మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ముప్పిడి ప్రకాష్‌బాబు, గౌరవాధ్యక్షులు రంగిసింగి ఎర్రయ్యదొర, ఆశపు ఆనంద్ పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

వ్యవ'సాయం' ఏదీ?

- సాగుకు అనుసంధానం కాని 'ఉపాధి'
- పెరిగిన పెట్టుబడులతో రైతుల అప్పులపాలు
- ఆదుకునే దిశగా కానరాని ప్రభుత్వ చర్యలు



వడ్డాదిలో చెరకు నాటుతున్న రైతులు



బుచ్చెయ్యపేటలో వరి ఆకు తీస్తున్న కూలీలు



లూలూరులో వరినాట్లు వేస్తూ...

బుచ్చెయ్యపేట: ప్రస్తుతం రైతుకు వ్యవసాయం కష్టతరమవుతోంది. ఒక వైపు పెరుగుతున్న ధరలతో పెట్టుబడుల భారం కావడం, మరో వైపు పంటలకు సరైన గిట్టుబాటు ధర రాక ఆర్థికంగా నష్టపోతున్నాడు. దీనికితోడు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించి రైతులను ఆదుకోవల్సిన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు.

రైతులు ఆరుగాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసిన నష్టాలే తప్ప లాభాలు చేకూరడం లేదు. వరి, చెరకు, సరుగుడు తదితర పంటలను వందలాది మంది కూలీలతో సాగు చేపట్టాలి. భూమి దుక్కు దున్ని దమ్ము చేసి వరి ఆకు తీసి నాట్లు వేసి కలుపు తీయడానికి వందలాది మంది కూలీలు అవసరం ఉంది. పెరిగిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు పెట్టుబడులతో రైతుకు ఆర్థిక భారం పడుతోంది. వరి, చెరకు పంటల సాగులో ఎకరాకు రూ.45 నుంచి రూ.60 వేలు ఖర్చవుతున్నా పంట అమ్మిన రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. ప్రభుత్వం కనీసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించి కూలీలను ఏర్పాటు చేస్తే కనీసం కూలి ఖర్చులైనా మిగులుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తడిసి మోపెడవుతున్న కూలీల ఖర్చు...

చెరకు, వరి, సరుగుడు సాగులో నాట్లు వేయడానికి, కలుపు తీయడానికి, గొప్పులు తవ్వడానికి, పంట కోతలు కోసేందుకు ఎకరాకు కనీసం 35 నుంచి 50 మంది కూలీలు అవసరమవుతుంది. ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పలు రకాల పనులు ప్రజలకు ఉపయోగపడక నిధులు వృథా అవుతున్నాయి. చిన్న, సన్నకారు రైతాంగానికి ఉపయోగపడేలా జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలను ఏర్పాటు చేస్తే, రైతాంగానికి కూలి నగదు భారం తప్పి లాభాలు ఆర్జిస్తారు. రోజుకు సరాసరి ఆడ కూలీలకు రూ.300, మగవారికి రూ.500 కూలీ రైతులు చెల్లిస్తున్నారు. వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసి కూలీలతో పని దినాలు కల్పిస్తే ఒక్కో రైతుకు ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేలు కూలీ డబ్బులు మిగులుతాయి. ఇటీవల వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఏటా కూలీల ఖర్చే రూ.1.50 లక్షలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నడుస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. నాకున్న ఐదెకరాల్లో చెరకు, వరి సాగు చేస్తున్నాను. ఏడాదికి కూలీలకే రూ.1.50 లక్షల వరకు చెల్లిస్తున్నాను. ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే నాకు కూలీల డబ్బులు మిగిలి లాభాలు వస్తాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి ఆదుకోవాలి.

– ఎల్లపు గోవింద, విజయరామరాజుపేట రైతు

కూలీల ఖర్చు భారం



జాతీయ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న కొన్ని రకాల పనులు రైతులకు, ప్రజలకు ఉపయోగపడటం లేదు. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి వరి, చెరకు, సరుగుడు సాగుకు కనీసం 70 మంది కూలీలను అప్పగిస్తే రైతులకు మేలు జరుగుతుంది. కూలీల ఖర్చు భారం ఉండదు. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకుని కూలీల ఏర్పాటు చేసి పని దినాలు కల్పించాలి.

– జెర్రిపోతుల రామారావు, దిబ్బిడి రైతు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



వ్యవసాయ సాగులో రైతులకు కూలీల ఖర్చుతో పాటు పెట్టుబడుల ఖర్చు పెరిగింది. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే రైతుకు మేలు కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ విధంగా చర్యలు తీసుకుంటోంది. ఎకరాకు 50 నుంచి 70 పనిదినాలు కల్పిస్తే రైతుకు కూలీ ఖర్చులు మిగిలి లాభాలు ఆర్జిస్తారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట

డిసెంబర్ 24లోగా గృహ నిర్మాణాలు పూర్తి

కె.సంతపాలెం, కింతాడ లేఅవుట్లలో పరిశీలించిన హౌసింగ్ ఏఈ నాయుడు



కె.సంతపాలెంలో లేఅవుట్‌లో నిర్మాణదారులకు సూచనలు చేస్తున్న హౌసింగ్ ఏఈ నాయుడు

కె.కోటపాడు: మండలంలో 28 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ అనుమతులు పొందిన లబ్ధిదారులు డిసెంబర్ 24లోగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ నాయుడు తెలిపారు. కె.సంతపాలెం, కింతాడ గ్రామాల్లోని లేఅవుట్లలో అసంపూర్తిగా నిలిచిన ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తే, పనుల స్థాయిని బట్టి బిల్లులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 28 లేఅవుట్లలో 547 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయగా, వీరిలో 262 మంది ఇప్పటికే నిర్మాణాలను పూర్తి చేసినట్లు హౌసింగ్ ఏఈ నాయుడు తెలిపారు. మిగిలిన 262 మంది లబ్ధిదారులు చేస్తున్న ఇంటి నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరంతా పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల ప్రదర్శనలో కార్యకర్తలు, విద్యార్థులు

చోడవరం రూరల్: పట్టణ శివారు వెంకయ్యగారిపేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు అందివ్వాలని సూచించారు. అనంతరం ఆది ఆంధ్రా పాఠశాల విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. బిడ్డకు తల్లి పాలివ్వడం ద్వారా వారిలో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆ ప్రక్రియ టీకాను మించి ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి రావికమతం ఐసీడీఎస్ పరిధిలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎ.అనిత, డి.శ్రీదేవి హాజరయ్యారు.

5వ షెడ్యూల్‌లో గిరిజన గ్రామాలను చేర్చాలి

గిరిజన ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో గదబూరులో నిరసన



గదబూరులో నిరసన కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు

మాడుగుల రూరల్: నాన్ షెడ్యూల్‌లోని గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడమే నిజమైన ఆదివాసీ దినోత్సవమని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహమూర్తి తెలిపారు. ఆదివాసీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గదబూరులో గ్రామ గిరిజనులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 320 ఆదివాసీ గ్రామాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో షెడ్యూల్‌లో చేర్పించే దిశగా చర్యలను తీసుకోవాలని కోరారు. షెడ్యూల్ ఏరియాలో కలపనందున ఆదివాసీల అడవులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఐటీడీఏ అభివృద్ధి ఫలాలను ఈ గ్రామాలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులను ఐదో షెడ్యూల్‌లో వెంటనే చేర్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టేకూరు చిలుకమ్మ, ఒండ్రు కొండమ్మ, పిల్లి ఎర్రయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యం



విద్యార్థినులతో ఇంగ్లిష్ చదివిస్తున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం: విద్యార్థినులకు విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యమని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. గురువారం మర్రిపాలెం కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణమంతా కలియ తిరిగి పారిశుధ్య పనులు పరిశీలించారు. తర్వాత విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 9, 10 తరగతులకు వెళ్లి పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. కొంత మంది విద్యార్థినులతో బ్లాక్ బోర్డుపై రాయించారు. కొందరు ఇంగ్లిష్ చెప్పడంలో తడబడంతో వారికి ప్రత్యేకంగా బోధించి లోపాలు సరి చేసేందుకు దృష్టి సారించాలని ప్రత్యేకాధికారి కె.భవానికి సూచించారు. భోజనం రుచి చూసి మెనూ అమల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశమయ్యారు. విధిగా తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించాలన్నారు. గతం కంటే విద్యార్థినుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అంకితభావంతో పని చేయాలన్నారు. వసతి సమస్యపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాల నుంచి బయటకు పోయే మురుగు ప్రవాహం ఆగిపోవడంతో పంచాయతీ కార్యదర్శి రమణను రప్పించి సిబ్బందితో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఉపాధి హామీ పథకంలో పెద్ద చెరువు గట్టుపై 500 కొబ్బరి మొక్కలు వేసే ప్రదేశాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

15న రక్తదాన శిబిరం



ట్రస్ట్ సభ్యులతో కలిసి గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: భారత్ నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న మాడుగులలో జరగనున్న రక్తదాన శిబిరానికి సంబంధించి గోడపత్రికను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం విడుదల చేశారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్నగా భావించి పదేళ్ల నుంచి శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ట్రస్ట్ సభ్యులు మధు నాగరాజు, కుమార్, రంజిత్ వర్మ, రొబ్బ మహేష్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన దేవరాపల్లి తహసీల్దార్



తహసీల్దార్ లక్ష్మి

దేవరాపల్లి: స్థానిక తహసీల్దార్ ఎం. లక్ష్మి తన విధుల్లో చేరారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఆమె శ్రీకాకుళం జిల్లాకు ఎన్నికల బదిలీపై వెళ్లారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆమె తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి గురువారం దేవరాపల్లిలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు వీఆర్వోలు, ఆర్ఐ తదితర రెవెన్యూ కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో ఆమె సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం తహసీల్దార్ బదిలీలు చేపట్టేందుకు సిద్ధం కాగా, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సాధ్యపడలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఎన్నికలు ముందు పని చేసిన తహసీల్దార్లను ఆయా స్థానాలకు తాత్కాలికంగా నియమించింది.

852 మందికి కౌలు కార్డులు లక్ష్యం

ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది 852 మందికి కౌలు కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం డివిజన్‌లోనే అధికంగా నాతవరం మండలంలో ఈ ఏడాది కౌలు రైతులకు కార్డులు ఇవ్వనున్నామన్నారు. ఇంతవరకు 230పైగా కౌలు కార్డులు పంపిణీ చేశామన్నారు. మిగతావి సకాలంలో ఇస్తామన్నారు. పంటలకు ఈ– క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో లేకుండా ఇవ్వాలన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది డ్యూటీ సమయంలో విధిగా రెవెన్యూ గ్రామాల్లోనే ఉండాలన్నారు. మండలం దాటి బయటకు వెళ్లేటప్పుడు విధిగా అనుమతి తీసుకోవాలన్నారు. సెలవు పెట్టకుండా నిర్లక్ష్యంగా బయటకు వెళ్తే ఆకస్మిక తనిఖీల్లో దొరికితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది వీఆర్వోలపై తరుచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారు పని తీరులో మార్పు రావాలన్నారు. సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ హరి, వీఆర్వోలు, సచివాలయ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా సభ్య రైతుల సమాచారం

బుచ్చెయ్యపేట: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో(పీఏసీఎస్) సభ్యులంతా ఈ నెలాఖరులోగా తమ సమాచారం అందించాలని తురకలపూడి, బంగారుమెట్ట పర్సన్ ఇన్‌చార్జులు పైడి రవి, పద్మజ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రైతుల భూ రికార్డులను కంప్యూటరీకరణ చేసి ఆన్‌లైన్ బ్యాంకింగ్ విధానాన్ని తీసుకురావడానికి తగిన సమాచారం కోసం రైతులు తమ వివరాలను అందించాలన్నారు. రైతు భూమి పాస్ పుస్తకం, వన్‌బీ, రేషన్, ఆధార్, పాన్ కార్డు, రెండు పాసు ఫొటోలు, నామినీ ఆధార్ కార్డు జెరాక్స్‌లు అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం డీఈ రామకృష్ణారావు తెలిపారు. మాకవరపాలెంలో 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని మాకవరపాలెం, రాచపల్లి జంక్షన్, తామరం, అవంతి కళాశాల, మెడికల్ కళాశాల, కొత్తపాలెం ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

కేజేపురం సబ్ స్టేషన్ పరిధిలో...

మాడుగుల రూరల్: కె.జె.పురం 33/11 కె.వి. సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. కె.జె.పురం, వంటర్లపాలెం, ముకుందపురం, వీరవల్లి, పోతనపూడిలోని రూరల్ ఫీడర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతుల దృష్ట్యా ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందన్నారు.

చీడికాడ: అప్పలరాజుపురం సబ్ స్టేషన్, ఫీడర్ పరిధిలో శుక్రవారం సరఫరా విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకటరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లో అడ్డువచ్చే చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిర్వహణ చేపట్టనున్న దృష్ట్యా ఫీడర్ పరిధిలో ఖండివరం, ఎల్.బి.పట్నం, వి.బి.పేట, బి.సింగవరం, కోడెంపూడి, గొప్పూరు, అప్పలరాజుపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సొసైటీకి సభ్య రైతుల వివరాలు

దేవరాపల్లి: ఎం. అలమండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తున్నందున సభ్య రైతులంతా తమ వివరాలను అందించాలని సీఈవో రొంగలి సత్యనారాయణ గురువారం తెలిపారు. స్థానిక పీఏసీఎస్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి పి. గుణసుందరరావు ఆదేశాల మేరకు సంఘ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్నామన్నారు.

పైపులైన్లకు లీకులు.. వృథాగా తాగునీరు

- తాగునీటి కోసం గ్రామస్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రోలుగుంట శివాలయం రోడ్డులో పైపులైను లీకై వృథాగా పోతున్న తాగునీరు



గ్రంథాలయం సమీపంలో రోడ్డుపై పారుతున్న తాగునీరు

రోలుగుంట: మండలంలో ఫ్లోరైడు గ్రామాలకు సరఫరా అయ్యే పైపులైనుకు పలు చోట్ల లీకేజీ సమస్య ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. తాగునీరు పూర్తిస్థాయిలో అందక బాధిత గ్రామాల వారు ఇక్కట్లు పడుతున్నారు. నిండుగొండ, కొవ్వూరు, ఎన్.కొత్తూరు, రాజుపేట, కె.నాయడుపాలెం తదితర గ్రామాలను 15 ఏళ్ల క్రితం ఫ్లోరైడు ప్రభావిత గ్రామాలుగా గుర్తించి జానకీరాంపురం ఏటి నుంచి పంపింగ్ సిస్టం ద్వారా శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే పైపులైను లీకులను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని మరమ్మతులు చేసే ప్రక్రియ కాంట్రాక్టరు నిర్వహిస్తారు. రోలుగుంట శివాలయం సమీపంలోను గ్రంథాలయం రోడ్డులోను ఏర్పడిన లీకులు సరిచేసేందుకు గోతులు తవ్వి వదిలేవారు. నాలుగు రోజులుగా పైపులైను లీకులు అధికమై తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గాని, కాంట్రాక్టరు గాని పట్టించుకోవడం లేదని బాధిత గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని సాక్షి సంప్రదించగా పది రోజుల క్రితం కొత్త కాంట్రాక్టరు టెండరు దక్కించుకున్నారన్నారు. తను ఇంకా పనులు చేపట్టలేదని, పాత కాంట్రాక్టరుతో లీకులు సరిచేసే చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అనారోగ్యంతో సబ్బవరం ఏఎస్ఐ మృతి

దహన ఖర్చులకు రూ.10 వేల అందజేత



మృతుడు రామునాయుడు కుమారుడికి నగదు అందిస్తున్న ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు/సబ్బవరం: సబ్బవరం ఏఎస్ఐ గొర్లె రామునాయుడు(59) అనారోగ్యంతో స్వగ్రామం కె.కోటపాడు మండలం కె.జె.పురంలో బుధవారం రాత్రి మృతి చెందారు. 2021లో బదిలీపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం క్యాన్సర్ సోకడంతో కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మరణించారు. గురువారం అతడి మృతదేహానికి పూలమాల వేసి సబ్బవరం ఎస్ఐ ఆర్.ధనుంజయ్ ఘన నివాళులర్పించారు. పోలీస్ లాంఛనాలతో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి దహన ఖర్చుల నిమిత్తం ఎస్ఐ రూ.10 వేలు అందించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు



స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఖాసిమ్

కె.కోటపాడు: సార్వత్రిక విద్యా పీఠం(దూర విద్యా విధానం) ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అయ్యన్న కాలేజీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ తెలిపారు. గురువారం కె.కోటపాడు స్టడీ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ 14 వయస్సు కలిగి చదవడం, రాసే పరిజ్ఞానం కలవారితోపాటు పదిలో ఉత్తీర్ణత కాని వారు పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు కాకుండా ఉన్న వారితోపాటు చదువు మధ్యలోనే నిలిపి వేసిన వారు ఐదు సబ్జెక్టులతో సింగిల్ సిట్టింగ్ విధానం ద్వారా ఇంటర్ కోర్సు పూర్తి చేయవచ్చునని తెలిపారు. ఈ నెల 31లోగా స్టడీ సెంటర్‌లో అడ్మిషన్లు పొందాలని కోరారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com